

టన్ను చీనీ రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు పలికాయి.



బీటెక్ కొత్త పుంతలు

బీటెక్ కోర్సులు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఇంజినీరింగ్‌లో జాబ్ గ్యారంటీ కోర్సులు ప్రవేశపెడుతున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
33.7°/23.4°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం బాగా పెరిగింది. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

తహసీల్దార్ల బదిలీలకు అనుమతి

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు సొంత జిల్లాలకు తిరిగి వచ్చేందుకు ప్రభుత్వం అనుమతిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తహసీల్దార్ల బదిలీలకు సంబంధించి సీసీఎల్ఏ ఉత్తర్వులు జారీ చేస్తారని రెవెన్యూ వర్గాలు తెలిపాయి.

విద్యుత్ శాఖ ఎస్ఈగా సంపత్‌కుమార్



అనంతపురం టౌన్: విద్యుత్ శాఖ ఉమ్మడి అనంతపురం జిల్లా ఎస్ఈగా సంపత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ సీఎండీ సంతోషరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి సీఎండీ కార్యాలయంలో ఈఈ (ఎంక్వైరీ) విభాగంలో పని చేస్తున్న సంపత్‌కుమార్‌కు ఎస్ఈగా పదోన్నతి కల్పిస్తూ అనంతపురం బదిలీ చేశారు. ఇక్కడ ఎస్ఈగా పని చేస్తున్న సురేంద్రను సీఎండీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

జాతీయ పారా అథ్లెటిక్స్‌లో క్రీడాకారుల ప్రతిభ

అనంతపురం: బెంగళూరు వేదికగా కంఠీరవ స్టేడియంలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరిగిన 13వ జాతీయ స్థాయి సబ్ జూనియర్, జూనియర్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో అనంతపురం క్రీడాకారులు ప్రతిభ చూపారు. మొత్తం పది మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొని, నలుగురు పతకాలు సాధించారు. అండర్–17 విభాగంలో అలవికొండ నరేష్ (టి–44) 400 ఎం విభాగంలో బంగారు, లాంగ్‌జంప్‌లో రజతం సాధించాడు. అండర్–17 ఎఫ్–13 షాట్‌పుట్ విభాగంలో మల్లెల సుదర్శన వెండి పతకం సాధించాడు. అండర్–17 (ఎఫ్–44) 100 ఎం.ఎం విభాగంలో అవలపాడు భార్గవ కుమార్ రజత పతకం కైవసం చేసుకున్నాడు. వీరిని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి షఫీ, విభిన్న ప్రతిభావంతుల ఏడీ రసూల్, శాప్ అథ్లెటిక్స్ కోచ్ మంజుల, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి నాగరాజు, శ్రీనివాసులు, అమ్మ ట్రస్ట్ రమణారెడ్డి తదితరులు అభినందించారు.

అంతరం.. ఆందోళనకరం



అమ్మాయిల జననాల సంఖ్య తగ్గుతోంది. లింగ నిష్పత్తిలో అంతరం ఆందోళన కలిగిస్తోంది. ఇందుకు ప్రధాన కారణం కొన్ని కుటుంబాల్లో అమ్మాయిలంటే ఇప్పటికీ చిన్నచూపు ఉండడమే. మగ సంతానానికి ఇస్తున్న ప్రాధాన్యత ఆడ సంతానం విషయంలో ఉండడం లేదు. గుట్టుగా లింగ నిర్ధారణ పరీక్షలు చేయించడం.. పుట్టబోయేది ఆడపిల్ల అని తెలియగానే వద్దనుకుని అబార్షన్ చేయించడం పరిపాటిగా మారింది. రాష్ట్రంలో అమ్మాయిల జననాలు తక్కువగా ఉన్న జిల్లాల్లో ఉమ్మడి అనంతపురం ప్రథమ స్థానంలో నిలవడం విస్మయం కలిగిస్తోంది.

- అమ్మాయిలు తగ్గిపోతున్నారు!
- లింగనిష్పత్తిలో భారీ వ్యత్యాసం
- అమ్మాయిల తగ్గుదలతో అబ్బాయిలకు కొత్త చిక్కులు

వెయ్యి మంది అబ్బాయిలకు అమ్మాయిల రాష్ట్ర సగటు	942
ఉమ్మడి అనంతపురం జిల్లాలో సగటు	892
జననాల రేటు	1.7
జిల్లాలో ఏడాదిలో నమోదైన అబార్షన్లు	2,472

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఓ వైపు విద్యా, వైద్య సాంకేతిక రంగాల్లో అమ్మాయిలు దూసుకెళుతున్నా.. మరోవైపు విద్యావంతులైన దంపతుల్లో కూడా కొందరు అమ్మాయిలను వద్దనుకుంటున్నారు. అసలే జననాల రేటు తగ్గిపోతుంటే.. అందులోనూ అమ్మాయిల సంఖ్య పడిపోతుండటం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని వల్ల రకరకాల సమస్యలు ఎదురవుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అమ్మాయిల జననాల సంఖ్య దారుణంగా ఉంది. ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 892 మంది మాత్రమే పుడుతున్నారు. రాష్ట్ర సగటు ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 942గా నమోదైంది. అమ్మాయిల జననాల రేటు క్రమంగా తగ్గుతుండటంతో కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి.

యుక్త వయసు అమ్మాయిల సంఖ్యా తగ్గింది

తాజా గణాంకాల ప్రకారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెళ్లీడుకొచ్చిన అమ్మాయిల సంఖ్య తగ్గినట్టు నిపుణులు చెబుతున్నారు. దీంతో అబ్బాయిలకు వివాహ సమస్యలు తీవ్రమయ్యాయి. అమ్మాయిలు దొరక్క అబ్బాయిలు సుదీర్ఘ కాలం పెళ్లిళ్లు కాకుండా ఉండిపోతున్నారు. జిల్లాలో సగటు పెళ్లి వయసు 26 నుంచి 29 ఏళ్లకు పెరిగినట్టు తెలుస్తోంది. కొందరికి 30 ఏళ్లు దాటితే అసలుకే మోసం వస్తోంది. 35 ఏళ్లు దాటినా పెళ్లిళ్లు కాకపోవడంతో అబ్బాయిల వేదన అంతా ఇంతా కాదు.

ఇతర రాష్ట్రాల అమ్మాయిలతో వివాహం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని శింగనమల, గుంతకల్లు, ఉరవకొండ, కదిరి, పుట్టపర్తి తదితర ప్రాంతాల అబ్బాయిలు ఇతర రాష్ట్రాల అమ్మాయిలతో వివాహ సంబంధాలు కుదుర్చుకుంటున్నారు. కర్ణాటక ప్రాంతంలోని కొన్ని చోట్ల పేద కుటుంబాల వద్దకు వెళ్లి అమ్మాయిని మాట్లాడుకుని ఏకంగా పెళ్లి చేసుకుని వస్తున్నారు. ఈ క్రమంలో అమ్మాయి తల్లిదండ్రులకు రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు చెల్లిస్తున్నట్లు అబ్బాయిలు చెబుతున్నారు. ఇక రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి అయితే మధ్యవర్తులకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర చెల్లిస్తున్నారు. వ్యవసాయం, వ్యవసాయాధార పనులు చేసుకుని జీవనం సాగించే అబ్బాయిలకు అమ్మాయిలు దొరకడం మరింత గగనమైపోయిందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

గుట్టుగా లింగనిర్ధారణ

అమ్మాయిల సంఖ్య పడిపోవడానికి పిండ దశలోనే లింగనిర్ధారణ కూడా కీలకమన్న విమర్శలు ఉన్నాయి. గర్భస్థ లింగనిర్ధారణ అతిపెద్ద నేరం. గర్భంలో ఉండగా శిశువు ఆడా.. మగా చెబితే డాక్టరు జైలుకు వెళతారు. అయినా సరే స్కానింగ్ కేంద్రాలు ముందే ఫలితం చెబుతుండటంతో అమ్మాయి అనగానే అబార్షన్ చేయించుకుంటున్నట్టు తెలుస్తోంది. పీసీపీఎన్‌డీటీ చట్టం ఉన్నా దీనిపై నిఘా లేకపోవడం వల్ల ఇలా జరుగుతున్నట్టు తెలుస్తోంది. గైనకాలజీ, రేడియాలజీ వైద్యులు ఈ ప్రక్రియ గుట్టు చప్పుడు కాకుండా చేస్తున్నట్టు సమాచారం. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాదిలో నమోదైన అబార్షన్ల సంఖ్య 2,472గా ఉంది.

1.7కు తగ్గిన జననాల రేటు

సంతానోత్పత్తికి అర్హత కలిగిన దంపతులు ఇద్దరు పిల్లలకు మొగ్గు చూపితే జననాల రేటు స్థిరంగా ఉంటుంది. కానీ అనంతపురం జిల్లాలో ఈ సగటు 1.7గా ఉంది. ఇది ఒకరకంగా ప్రమాదానికి సంకేతమని హెచ్చరిస్తున్నారు. చాలామంది ఒక్కర్ని కనడానికే మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా బాగా చదువుకున్న దంపతుల్లో ఈ పోకడ కనిపిస్తోంది. ఒక జంట ఇద్దర్ని కంటేనే సుస్థిర జననాల రేటు నమోదు అవుతుందని వైద్యులు చెబుతున్నారు.

కెరీర్ కోసం లేటుగా కంటున్నారు



ఇదివరకు పెళ్లయిన రెండేళ్లలో తొలి సంతానం కనేవారు. ఇప్పుడు కెరీర్ పేరిట పెళ్లయిన ఐదారేళ్లకు కానీ కనడం లేదు. లేటుగా మ్యారేజీ కావడం, దానికి తోడు బిడ్డలను కనడం పోస్ట్‌పోన్ చేయడం ఇబ్బందిగా ఉంది. 35 ఏళ్లు దాటాక ఒక్కరే చాలనే భావన వస్తోంది. ఇక అమ్మాయిల సంఖ్య తక్కువగా ఉండటానికి కచ్చితంగా గర్భస్థ దశలోనే లింగనిర్ధారణ చేస్తుండటం. ఇది చాలా నేరం. దీనివల్ల అమ్మాయిల సంఖ్య మరింతగా తగ్గే అవకాశం ఉంది.

– డా.నిస్సీ వినూత్న, గైనకాలజిస్ట్

సంతానోత్పత్తి తగ్గడంతోనే వ్యత్యాసం



స్త్రీ, పురుష నిష్పత్తి తగ్గడానికి సంతానోత్పత్తి తగ్గడమే ప్రధానమైన కారణం. పుట్టే పిల్లల సంఖ్య బాగా తగ్గుతోంది. ఆలస్యంగా పెళ్లిళ్లు కావడంతో సంతానోత్పత్తిపై ప్రభావం చూపిస్తోంది. తద్వారా పిల్లలు ఆలస్యంగా జన్మిస్తున్నారు. ఒక సంతానంతో సరిపెడుతున్నారు. తొలిసారి అబ్బాయి పుడితే ఇక చాలు అని భావిస్తున్నారు. తొలిసారి అమ్మాయి అయితే అబ్బాయి కావాలని మరో సంతానం కోసం ప్రయత్నిస్తున్నారు.

– ప్రొఫెసర్ ఎండీ బావయ్య, రిటైర్డ్ ప్రొఫెసర్, ఎకనామిక్స్, ఎస్కేయూ

ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ బాధ్యతల స్వీకరణ



ఇన్‌చార్జ్ వీసీకి అభినందనలు తెలుపుతున్న రెక్టార్, రిజిస్ట్రార్ తదితరులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ బి.అనిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి.మునినారాయణప్ప, డాక్టర్ కె.అనిత, ఎస్ఈ వి.మధుసూదన్‌రెడ్డి, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఎంవీ ప్రభాకర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తదితరులు అభినందనలు తెలిపారు. అనంతరం ఇన్‌చార్జ్ వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీ పురోభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. తనను నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

వేధింపుల కేసులో అత్తకు జైలు

అనంతపురం: కోడలను వేధించిన కేసులో అత్తతో పాటు మరొకరికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ అనంతపురం నాలుగో ఏడీజే కోర్టు తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే... తాడిపత్రి మండలం యర్రగుంట గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డితో ప్రత్యూషకు వివాహం అయింది. పెళ్లి సమయంలో రూ.3 లక్షల నగదు, 16 తులాల బంగారు కట్నంగా ముట్టజెప్పారు. మూడేళ్ల సంసారం సాఫీగా సాగింది. అనంతరం భర్త చంద్రశేఖర్‌రెడ్డి విదేశాలకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అత్త లక్ష్మీదేవి, ఆమెతో సహజీవనం చేస్తున్న నాగార్జున రూ.2లక్షలు అదనపు కట్నం తేవాలని ప్రత్యూషను వేధింపులకు గురిచేశారు. రోజురోజుకూ వేధింపులు పెరిగిపోవడంతో ప్రత్యూష ఫిర్యాదు మేరకు 2017 సంవత్సరంలో తాడిపత్రి అర్బన్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ రామచంద్రారెడ్డి కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివప్ప దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అన్ని కోణాల్లో విచారించిన అనంతపురం ఏడీజే కోర్టు జడ్జి శోభారాణి నేరం రుజువు కావడంతో అత్త లక్ష్మీదేవితో పాటు నాగార్జునకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. ముద్దాయిలకు శిక్ష పడేలా కృషి చేసిన ఏపీపీ సుజన, దర్యాప్తు అధికారులను, కోర్టు లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ చౌరెడ్డిలను ఎస్పీ కేవీ మురళీకృష్ణ అభినందించారు.

దాడులు అమానుషం

- దాడులు టీడీపీవి.. కేసులు వైఎస్సార్‌సీపీపైనా?
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



తాడిపత్రి: పుంగనూరులో ఎంపీ మిథున్, మాజీ ఎంపీ రెడ్డప్పపై టీడీపీ గూండాలు రాళ్లు, మారణాయుధాలతో దాడులు చేయడం అమానుషమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. శుక్రవారం ఆయన తాడిపత్రిలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ గూండాలు బరితెగించి హింసాత్మక ఘటనలకు పాల్పడితే పోలీసులు మాత్రం ఎంపీ, మాజీ ఎంపీతో సహా 36 మంది వైఎస్సార్‌సీపీ వారిపైనే కేసులు, అదీ హత్యాయత్నం తదితర సెక్షన్ల కింద నమోదు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని దాడులు, హత్యలు, ఆస్తుల విధ్వంసాలకు పాల్పడుతున్నారన్నారు. మూడు రోజుల క్రితం వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ హత్యకు గురయ్యాడని, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు బయల్దేరిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దాదాపు పది చోట్ల పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించారన్నారు. దీనికితోడు కండీషన్ లేని బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని కేటాయించడం కూటమి ప్రభుత్వ కక్ష పూరిత వైఖరికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో హింస, కక్ష పూరిత చర్యలకు ఎంతమాత్రమూ తావుండరాదన్నారు. ఎన్నికల్లో గెలిచిన టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇప్పటికైనా వారి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడకుండా నియంత్రించాలని కోరారు. అధికర పార్టీయేతరులను శత్రువులుగా చూడడం కరెక్టు కాదన్నారు. తమ దృష్టంతా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం తప్ప ఎవరిపైనా కక్ష సాధింపులు ఉండవని తరచూ చెప్పే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆచరణలో చూపడం లేదని విమర్శించారు. దాడులు, అక్రమ కేసులను ఆపి.. నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, 20 లక్షల ఉద్యోగాల కల్పన వంటి హామీలను నెరవేరిస్తే బాగుంటుందని హితవు పలికారు. అలాగే విభజన హామీల అమలుతో పాటు ఏపీకి ప్రత్యేక హోదా సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రత్యేక రైల్వే జోన్, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ వంటి వాటిని కేంద్రం ద్వారా సాధించగలిగితే రాష్ట్ర ప్రజలు హర్షిస్తారన్నారు. వీటన్నింటిపై దృష్టి సారించి రాష్ట్రాభివృద్ధికి కృషికి చేయాలే తప్ప రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చేందుకు కాదని అన్నారు.

వర్షాలొస్తాయి.. అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్, చిత్రంలో కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం అర్బన్: జిల్లాకు భారీ వర్ష సూచన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. మండల స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. భారీ వర్షాలు, వరదలు, విపత్తు నిర్వహణపై జాయింట్ కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్ నుంచి నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా అధికారులతో కలిసి ఆర్డీఓలు, మునిసిపల్ కమిషనర్లు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ వర్షాల కారణంగా ఎలాంటి విపత్తులు సంభవించినా ఎదుర్కొనేందుకు అధికారులు, ఉద్యోగులు సంసిద్ధంగా ఉండాలన్నారు. రెవెన్యూ డివిజన్, మండల, గ్రామస్థాయి అధికారులు మరింత బాధ్యతగా ఉండాలని సూచించారు. పాతబడిన భవనాలను గుర్తించి అందులో నివాసముండే వారిని, ఆ ప్రాంతంలో ఉండే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. గ్రామాల పరిధిలో వాగులు, వంకల ప్రవాహ తీవ్రతను ముందుగానే గుర్తించి సమస్యలు రాకుండా వీఆర్‌ఓలు, వీఆర్ఏలు, పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వరద నీరు ప్రవహించే ప్రదేశాల్లోకి పశువులు, గొర్రెలు, మేకలు వెళ్లకుండా కాపర్లు జాగ్రత్త పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. చెరువులకు గండ్లు పడే పరిస్థితి రావచ్చని, కాబట్టి ఇసుక బస్తాలను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్వో జి.రామకృష్ణారెడ్డి, సెబ్ ఏఎస్పీ రామకృష్ణ, ఆర్‌డీఎంఏ పీవీఎస్ఎన్ మూర్తి, డీపీఓ ప్రభాకర్‌రావు, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, డీటీసీ వీర్రాజు, డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్‌బాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

భారీ వర్ష సూచన నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదురైనప్పుడు సహాయం కోసం, లేదా సమాచారం ఇచ్చేందుకు కంట్రోల్ రూమ్ 85002 92992, 08554–220009 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

37 ఏళ్ల క్రితం కేసు.. నిర్దోషిగా తీర్పు



నిర్దోషిగా విడుదలైన లక్ష్మన్నతో న్యాయవాది ఆర్.బాలాజీనాయక్

అనంతపురం: చోరీ కేసులో నిందితుడికి విముక్తి లభించింది. నేరారోపణ రుజువు కాకపోవడంతో నిర్దోషిగా గుర్తించి జ్యుడీషియల్ కస్టడీ నుంచి విడుదల చేయాలని కోర్టు తీర్పు వెలువరించింది. వివరాలిలా ఉన్నాయి. అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బి.లక్ష్మన్న అనే వ్యక్తిపై 1987లో చోరీ కేసు నమోదైంది. అప్పట్లోనే అతడు ఊరు విడిచి వేరే ప్రాంతానికి వెళ్లిపోయాడు. చోరీ కేసు పరిష్కరించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అవడంతో పోలీసులు ఎట్టకేలకు నిందితుడు లక్ష్మన్నను పట్టుకుని గత ఏడాది డిసెంబర్ 30న జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఈ కేసుకు సంబంధించి శుక్రవారం వాదోపవాదనలు విన్న సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ... లక్ష్మన్నపై నేరారోపణ రుజువు కాకపోవడంతో నిర్దోషిగా భావిస్తూ జ్యుడీషియల్ కస్టడీ నుంచి విడుదల చేయాలని తీర్పు చెప్పారు. న్యాయవాది ఆర్.బాలాజీ నాయక్ బృందం లక్ష్మన్న తరపున వాదనలు వినిపించింది.

22 నుంచి హెచ్చెల్సీకి నీరు

తుంగభద్ర బోర్డు గ్రీన్ సిగ్నల్



నీటితో కళకళలాడుతున్న టీబీ డ్యాం

అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీటి విడుదల ముహూర్తం ఖరారైంది. ఈ నెల 22 నుంచి నీటి విడుదలకు బోర్డు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కర్ణాటక కూడా ఇండెంట్ ఇవ్వడంతో ఇరు రాష్ట్రాలకు నీటిని విడుదల చేయనున్నారు. 22వ తేదీన 500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయనున్నారని హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. క్రమంగా నీటిని పెంచుతూ పోతారన్నారు. ఈ నెల 24 తేదీకి జిల్లాలోకి తుంగభద్ర జలాలు ప్రవేశిస్తాయని చెప్పారు.

కాలువల పరిశీలన

నీటి విడుదల ఖరారైన నేపథ్యంలో శుక్రవారం తుంగభద్ర బోర్డు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి, హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, మునీరాబాద్ ఎస్ఈ బసవరాజు, సెక్రటరీ ఓఆర్ రెడ్డి తదితరుల కాలువలను పరిశీలించారు. జలాశయం వద్ద నుంచి జిల్లా సరిహద్దు వరకూ అధికారుల బృందం పర్యటించింది. ఎక్కడైనా ఇబ్బందులున్నాయా? ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

ఒక్క రోజులోనే 10 టీఎంసీలు

బొమ్మనహాళ్: భారీ వరదలతో తుంగభద్ర జలాశయానికి ఒక్క రోజులోనే 10 టీఎంసీల నీరు వచ్చి చేరింది. శుక్రవారం ఉదయం 1,08,790 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. గురువారం 46.802 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, శుక్రవారం ఉదయానికి అది 55.972 టీఎంసీలకు చేరుకుంది. తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతాలైన మలెనాడు, శివమొగ్గ, ఆగుంబే, శృంగేరి, చిక్‌మంగళూరు, వరనాడుడలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీందో వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 1,633 అడుగులు కాగా.. ప్రస్తుతం 1618.03 అడుగులకు చేరింది. ఈ ఏడాది హెచ్చెల్సీ ఆయకట్టులో వరి, మిరప సాగు చేసేందుకు రైతులు ఇప్పటికే బోరు బావుల కింద నారుమడులు వేసుకుని సిద్ధంగా ఉన్నారు.

వైభవంగా కుళ్లాయిస్వామి చివరి దర్శనం



నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాలు పద మూడు రోజులపాటు వైభవంగా జరిగాయి. శుక్రవారం గూగూడు కుళ్లాయి స్వామి (పీరు) చివరి దర్శనం కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు హుసేనప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. తిరుమల కొండన్న వంశస్తులు కొబ్బరి దివిటీల వెలుగులో, సన్నాయి వాయిద్యాల మధ్య పట్టు వస్త్రాలు, బంగారు గొలుసుల అలంకరణలో స్వామి వారి చివరి దర్శనభాగ్యం కల్పించారు. స్వామి చివరి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గోవింద నామస్మరణలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. తదనంతరం స్వామి వారిని పట్టు వస్త్రాల మధ్య ఉంచి పెట్టెలో భద్రపరిచారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణకుమారి, గ్రామ పెద్దలు శివశంకర్‌రెడ్డి, షాబీరా, గోపాల్, శివయ్య, రాజారెడ్డి, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

దోమకాటు నివారణ చర్యలు చేపట్టండి

అనంతపురం మెడికల్: దోమకాటు నివారణ చర్యలు ముమ్మరం చేయాలని సంబంధిత అధికారులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి ఆదేశించారు. అనంతపురంలోని నీరుగంటి వీధిలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఇంటింటా తిరిగి నీరు నిల్వ ఉంచుకున్న డ్రమ్ములు, తొట్టెలను పరిశీలించారు. ల్వారా దశను గుర్తించి ఆయా తొట్టెలను శుభ్రం చేయించేలా చర్యలు తీసుకున్నారు. ఇంటితో పాటు పరిసరాలనూ శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. దోమకాటు వ్యాధులపై చైతన్య పరిచారు. నగరంలోని 10 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లోనూ రోగ నిర్ధారణ పరీక్షలు చేసే సదుపాయం ఉందని, జ్వరం లక్షణాలు కన్పిస్తే వెంటనే ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకుని, చికిత్స పొందాలని సూచించారు. దోమ తెరలు వినియోగించడం అన్నింటా సురక్షితమని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేను తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్ నూర్‌బాషా, ఆరోగ్య కార్యదర్శి లక్ష్మీదేవి, అసిస్టెంట్ శంకరయ్య పాల్గొన్నారు.

నవరత్నాల లోగో ధ్వంసం



గుమ్మఘట్ట: మండల కేంద్రంలో రూ.21.40లక్షల ప్రజాధనంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన నవరత్నాల లోగోను టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. ఘటనపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు.

పాడి పశువుల అభివృద్ధే లక్ష్యం



గేదెకు చికిత్స చేస్తున్న డాక్టర్ సుధాకర్

పెద్దవడుగూరు: పాడిపశువుల అభివృద్ధికి కృషి చేయాలని రైతులకు పశుగణాభివృద్ధి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ పిలుపునిచ్చారు. పెద్దవడుగూరు మండలం కాశేపల్లిలో శుక్రవారం లింగ నిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భాదారణ పథకంపై పాడి రైతులకు ఆయన అవగాహన కల్పించారు. పాడి పశువులు అభివృద్ధి జరగాలంటే పెయ్య దూడలు జన్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశువులను పరీక్షించి రూ.1,350 విలువ చేసే సూదులను సబ్సిడీతో రూ.500కే అందిస్తున్నామన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విదేశీ జాతులనే కాకుండా స్వదేశీ జాతులైన గిర్, సాహివాల్, తార్పర్కార్ లాంటి బ్రీడ్‌లను కూడా ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి కమల, సిబ్బంది పాల్గొన్నారు.

'బీటెక్' కొత్త పుంతలు

- మైనర్ డిగ్రీగా బీఎఫ్ఎస్ఐ కోర్సు
- బ్యాంకింగ్, ఆర్థిక, బీమా రంగాల్లో ఉద్యోగావకాశాలు పెరగడమే కారణం
- ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే అమలుకు ఏఐసీటీఈ సిఫార్సు
- డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీలతో ఇప్పటికే అమలు



అనంతపురం: ఇంజినీరింగ్ కోర్సు స్వరూపం క్రమంగా మారిపోతోంది. కోర్సు పూర్తికాగానే జాబ్ గ్యారెంటీ కోర్సులను ఇప్పుడు ఇంజినీరింగ్‌లోనూ ప్రవేశపెడుతున్నారు. ఈ విద్యాసంవత్సరం బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ)కోర్సును అందుబాటులోకి తెచ్చారు. డిగ్రీతో పాటు ఇంజినీరింగ్ సహా ఎవరైనా ఈ కోర్సును అభ్యసించే వెసులుబాటు ఉంది.

సాంకేతిక విద్యనే కాక..

పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే విద్యార్థులు ఇతర పాఠ్యాంశాలనూ అభ్యసించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో బీటెక్‌లో చేరితే ఇప్పటి వరకూ కేవలం సాంకేతిక విద్యను మాత్రమే అభ్యసించేవారు. ఇకపై టెక్నికల్ సబ్జెక్టులు చదివే రోజులు పోయాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా రంగాల్లో ఉద్యోగావకాశాలు అపారంగా ఉండటంతో ఇంజినీరింగ్‌లో వీటిని ఒక మైనర్ డిగ్రీగా ప్రవేశపెట్టారు. ఏఐసీటీఈ (ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) సిఫారసు మేరకు జేఎన్‌టీయూ (అనంతపురం) ఈ మార్పును అందిపుచ్చుకునేందుకు సిద్ధమైంది. ఇప్పటికే అటానమస్, అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలూ దరఖాస్తు చేశాయి.

సిలబస్, బోధన బాధ్యత కన్సార్షియందే

బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా రంగాల్లో సేవలను అందిస్తున్న వివిధ అంతర్జాతీయ సంస్థలు కలసి బీఎఫ్ఎస్ఐ కన్సార్షియంగా ఏర్పడ్డాయి. ఈ సంస్థ కోర్సుకు సంబంధించిన పాఠ్య ప్రణాళిక (సిలబస్)ను రూపొందిస్తుంది. పాఠ్యాంశాలనూ ఆ సంస్థ ప్రతినిధులే బోధిస్తారు. బీటెక్ రెండు, మూడో సంవత్సరం నుంచి నాలుగు సెమిస్టర్లలో ఈ కోర్సును చదవాల్సి ఉంటుంది. ఏఐసీటీఈ మార్గదర్శకాల ప్రకారం దీనికి 18 నుంచి 20 వరకు క్రెడిట్లు ఉంటాయి. ఎంపికైన వారికి ఆయా కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ సైతం కల్పిస్తారు.

మారుతున్న ఇంజినీరింగ్ కోర్సు స్వరూపం

బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా రంగాల్లో ఉద్యోగాలు దక్కాలంటే బీటెక్ అనంతరం ఎంబీఏ తప్పనిసరిగా చదవాలి. ఎంబీఏ పట్టా ఉంటేనే ఈ రంగాల్లో ఉద్యోగావకాశాలు దక్కుతాయి. తాజాగా బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా రంగాల్లో రాణించడానికి ఇంజినీరింగ్ కోర్సుల్లోనే వీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. వాస్తవానికి బ్యాంకులు, బీమా, ఇతర ఫైనాన్స్ సంస్థల కార్యకలాపాలు సజావుగా సాగేలా వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీల నుంచి సహకారాన్ని అందిపుచ్చుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ అనుబంధ అవకాశం ఉన్న ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆయా కంపెనీలు ప్రాధాన్యతనిస్తున్నాయి. వీటిపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకునే వారి కెరీర్ ఉజ్వలంగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ క్రమంలో బీటెక్‌లో బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, బీమా (బీఎఫ్ఎస్ఐ)లను మైనర్ డిగ్రీ ప్రవేశపెట్టాలని ఏఐసీటీఈ భావించింది.

విద్యార్థుల ఉన్నతికి దోహదం

మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ తదితర కోర్ బ్రాంచ్‌ల్లో చేరిన వారికి ఉద్యోగాలు మునుపటి మాదిరి వేగంగా దొరకడం లేదు. వీరికి మరిన్ని అవకాశాలను సృష్టించడానికి ఏఐసీటీఈ మైనర్ డిగ్రీ విధానాన్ని కొన్నేళ్ల క్రితమే ప్రవేశపెట్టింది. బీటెక్ మెకానికల్ చదువుతున్న వారు.. డేటా సైన్స్, ఏఐ అండ్ ఎంఎల్, సైబర్ సెక్యూరిటీల్లో ఏదో ఒక దానిని మైనర్ డిగ్రీగా ఎంచుకోవచ్చు. సీఎస్ఈ విద్యార్థులు సైతం ఇతర బ్రాంచీలకు సంబంధించిన సబ్జెక్టులను మైనర్ డిగ్రీగా తీసుకోవచ్చు. ఈ మల్టీడిసిప్లినరీ విధానంతో ఆయా విద్యార్థుల ఉన్నతికి దోహదపడుతోంది.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. తాగుడు మానేయకుండా కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసిన భర్త వైఖరితో విసుగు చెంది ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడగా... క్షణికావేశంలో మరో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు.

- తాడిపత్రి రూరల్: స్థానిక టైలర్స్ కాలనీకి చెందిన శివప్రసాద్ (23) ఇంటీరియర్ డెకరేషన్ పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులకు తెలియకుండా రూ.2లక్షల వరకు చీటీ డబ్బు సొంత ఖర్చులకు వాడుకున్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మందలించడంతో క్షణికావేశంలో శుక్రవారం ఉదయం స్థానిక కేజీబీవీ సమీపంలోని పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై రైల్వే ఎస్ఐ నాగప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఎల్లమ్మ వీధిలో నివాసముంటున్న రేణుక (32), అక్కులప్ప దంపతులు కూలి పనులతో జీవనం సాగించేవారు. ఈ క్రమంలో అక్కులప్ప మద్యానికి బానిసై తన సంపాదనతో పాటు భార్య సంపాదననూ తీసుకెళ్లి తాగుడుకు ఖర్చు పెట్టేవాడు. దీంతో కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తాళలేక జీవితంపై విరక్తి పెంచుకున్న రేణుక శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాడిపత్రి అర్బన్: అతిగా మద్యం సేవించి ఓ గుర్తు తెలియని వ్యక్తి(45) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని సీబీ రోడ్డులో శుక్రవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మద్యం మత్తులో అపస్మారక స్థితిలో పడి ఉన్న విషయాన్ని స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక సదరు వ్యక్తి మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బాధ్యతగా పనిచేస్తే ఆరోపణలు ఎందుకొస్తాయి?

- డ్వామా అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి
- కూడేరులో సామాజిక తనిఖీ ప్రజావేదిక
- రూ.12.20 లక్షల అభియోగం.. రూ.70 వేలకు నిర్ధారణ



సిబ్బందిని నిలదీస్తున్న ఏపీడీ సుధాకర్‌రెడ్డి

కూడేరు: బాధ్యతగా పని చేస్తూ రికార్డుల నిర్వహణ పక్కాగా ఉంటే ఆరోపణలు, సమస్యలు ఎందుకొస్తాయని జిల్లా నీటి యాజమాన్య సంస్థ సిబ్బందిని ఆ సంస్థ ఏపీడీ సుధాకర్‌రెడ్డి నిలదీశారు. శుక్రవారం కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ నారాయణరెడ్డి అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2023 -24 ఏడాదిలో ఉపాధి హామీ పథకం కింద రూ.7.56 కోట్లతో కూలీలతో, మెటీరియల్‌తో చేపట్టిన పనులు, సామాజిక భద్రతా పింఛన్ల నగదు పంపిణీపై క్షేత్ర స్థాయిలో చేపట్టిన తనిఖీలో వెలుగు చూసిన అక్రమాలను సామాజిక తనిఖీ రాష్ట్ర రీసోర్స్ పర్సన్ లక్ష్మీనారాయణ బృందం చదివి వినిపించింది. హార్టికల్చర్ కింద నాటిన పండ్ల మొక్కలు చాలా మంది రైతుల పొలాల్లో లేవని, ఫారంపాండ్లు, నేమ్‌బోర్డులు సరిగా లేవని, పునాది వరకు పక్కా ఇళ్లు నిర్మించుకుంటే ఇంటెల్ లెవల్‌కు బిల్లులు చేశారని ఈ లెక్కన 14 పంచాయతీల్లో మొత్తం రూ.12.20లక్షలు దుర్వినియోగమైనట్లు అభియోగం మోపారు. దీనిపై జిల్లా అధికారులు విచారించగా అందుకు గల కారణాలను ఆధారాలతో సహా సిబ్బంది వివరించింది. దీంతో రూ.70 వేలు దుర్వినియోగమైనట్లు తేలింది. బాధ్యులైన వారి నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఏపీడీ విజయలక్ష్మి, ఎంపీడీఓ విజయలలిత, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ శేఖర్, ఏపీఓ తులసీప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రేపు రాష్ట్ర స్థాయి భజన పోటీలు

బొమ్మనహాళ్/బెళుగుప్ప: గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా బెళుగుప్ప మండలం నక్కలపల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉత్తమ హార్మోనిస్టు, తబలిస్టు, గాయకులకు ప్రత్యేక బహుమతులు అందించనున్నారు. అలాగే పోటీలో గెలుపొందిన జట్లకు నగదు పురస్కారాలతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నారు. వివరాలకు 99082 97598, 99086 56059, 79933 14329లో సంప్రదించవచ్చు.

ట్రాక్‌మెన్ బలవన్మరణం

- గుర్తు తెలియని మృతదేహంగా ఖననం చేసిన జీఆర్‌పీలు
- ఎస్ఎస్ఈలను సస్పెండ్ చేయాలంటూ ట్రాక్‌మెన్ల ఆందోళన



ట్రాక్‌మెన్లతో మాట్లాడుతున్న డీఆర్ఎం విజయ్‌కుమార్ (ఇన్‌సెట్) హరి ఓమ్ నారాయణ (ఫైల్)

గుంతకల్లు: ట్రాక్‌మెన్ హరి ఓమ్ నారాయణ (30) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గుంతకల్లు డివిజన్‌లో సంచలనం రేపింది. ఈ నెల 15న గుంతకల్లు-మద్దికెర సెక్షన్‌లోని మల్లప్పగేట్ సమీపంలో ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో జీఆర్‌పీ సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించింది. తొలుత గుర్తు తెలియని మృతదేహంగా గుర్తించి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో అనాథ మృతదేహంగా భావించి మరుసటి రోజు ఖననం చేశారు. అయితే వాట్సాప్ గ్రూప్‌లో చూసిన సహోద్యోగులు మృతుడిని హరిఓమ్ నారాయణగా గుర్తించారు. విషయం తెలుసుకున్న వందలాది ట్రాక్‌మెన్లు, ఇంజినీరింగ్ విభాగంలోని ఉద్యోగులు శుక్రవారం ఉదయం డీఆర్ఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆందోళనకు దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, మజ్దూర్ యూనియన్ నాయకుడు శ్రీనివాసశర్మ తదితరులు మద్దతు తెలిపారు.

ఆ ఇద్దరే కారణమంటూ...

గుంతకల్లులోని ఎస్ఎస్ఈ పీడబ్ల్యూ బీజీ విభాగం ఆరో గ్యాంగ్‌లో ట్రాక్‌మెన్‌గా పని చేస్తున్న బీహార్‌కు చెందిన హరిఓమ్ నారాయణ ఆత్మహత్యకు సీనియర్ సెక్షన్ ఇంజినీర్లుగా వ్యవహరిస్తున్న సంతోష్‌కుమార్, శశి కారణమంటూ ఆందోళనకారులు ధ్వజమెత్తారు. ట్రాక్‌మెన్లను చిన్నచూపు చూస్తూ వేధింపులకు గురి చేసేవారన్నారు. ఈ క్రమంలో హరిఓమ్ నారాయణను మరింత వేధింపులకు గురి చేశారన్నారు. కొన్ని రోజులుగా ఆరోగ్యం సరిగా లేక సిక్ లీవ్‌లో ఉన్న నారాయణకు ఈ నెల జీతం అందకుండా నిలిపి వేశారన్నారు. జీతం రాకపోతే నెలా నెలా కట్టాల్సిన లోన్ ఇన్‌స్టాల్‌మెంట్‌లు పెండింగ్‌లో పడిపోతాయని అధికారుల వద్దన నారాయణ ఆందోళన వ్యక్తం చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో నారాయణ ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తెలిపారు. నారాయణ ఆత్మహత్యకు కారకులైన ఎస్ఎస్ఈలు సంతోష్‌కుమార్, శశిను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఓ రైల్వే కార్మికుడిని అనాథ శవంగా పేర్కొంటూ ఖననం చేయడం దారుణమని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న డీఆర్ఎం విజయకుమార్ వెంటనే ఆందోళనకారులతో మాట్లాడారు. నారాయణ ఆత్మహత్యపై విచారం వ్యక్తం చేశారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధిత కుటుంబసభ్యులకు న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. దీంతో ట్రాక్‌మెన్లు ఆందోళన విరమించారు.

నూతన రిజిస్ట్రార్ నియామకంపై ఉత్కంఠ



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ నూతన రిజిస్ట్రార్ ఎవరు అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతమున్న రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య హోదా కాలం ఈ నెల 21న ముగియనుంది. 21న ఆదివారం కావడంతో శనివారమే ఆయన తప్పుకోనున్నారు. ఈ నేపథ్యంలో నూతన రిజిస్ట్రార్ నియామకం అనివార్యమైంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన బి.అనిత గౌడ్‌ను ఇన్‌చార్జ్ వీసీగా నియమించారు. అలాగే ఓసీ సామాజిక వర్గానికి రెక్టార్ హోదాను అప్పగించారు. ఈ క్రమంలో రిజిస్ట్రార్ హోదాను ఏ సామాజిక వర్గానికి కేటాయిస్తారనే అంశంపై వర్సిటీలో ఊహాగానాలు మొదలయ్యాయి. కాగా, సింహభాగం రిజిస్ట్రార్ పోస్టు ప్రొఫెసర్లకే అప్పగిస్తారు. బోధనేతర ఉద్యోగుల్లో డిప్యూటీ రిజిస్ట్రార్, ఆపై స్థాయి స్కేల్ తీసుకుంటున్న వారికి అప్పగించే అవకాశాలుంటాయి. తాజాగా రిజిస్ట్రార్ హోదా కోసం బోధనేతర ఉద్యోగుల్లో ఇద్దరు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బోధనేతర ఉద్యోగులకు అప్పగిస్తే రమేష్ బాబు (స్టాటిస్టికల్ ఆఫీసర్), డాక్టర్ లక్ష్మీరాం నాయక్ పేర్లను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. ప్రొఫెసర్లకు అవకాశం కల్పిస్తే ప్రొఫెసర్ దాశరథి రవీంద్ర(లైబ్రరీ సైన్సెస్), డాక్టర్ ప్రభాకర్ (ఎంబీఏ విభాగాధిపతి), ప్రొఫెసర్ ఆంజనేయులు (కామర్స్) పేర్లు ప్రతిపాదనలో ఉన్నాయి. ఇన్‌చార్జ్ వీసీగా ఆచార్య బి.అనిత గౌడ్ బాధ్యతలు తీసుకున్న ఒక రోజులోనే ఆమెకు రిజిస్ట్రార్ ఎంపిక చిక్కు ఎదురైంది.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడి

శింగనమల: మండలంలోని చిన్న జలాలపురంలో వైఎస్సార్‌సీపీ మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి లలితాకళ్యాణి కుటుంబసభ్యులు రామలింగ, రామాంజినేయులు, వెంకటేష్, నారాయణమ్మ, లక్ష్మీదేవిపై స్థానిక టీడీపీ నాయకులు పట్నం నగేష్, ఆయన అనుచరులు దాడి చేశారు. పాతకక్షల నేపథ్యంలో గురువారం రాత్రి ఇంటి మీదకు వచ్చి దాడి చేసినట్లు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. పట్నం నగేష్, ఆయన అనుచరుల నుంచి తమ కుటుంబసభ్యులకు రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా పోలీసులను బండి లలితాకళ్యాణి కోరారు.

మహిళను ఏమార్చి నగదు అపహరణ



బాధితురాలు లక్ష్మి

అనంతపురం: చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన మహిళను ఏమార్చి నగదు అపహరించుకెళ్లిన ఘటన అనంతపురంలో వెలుగు చూసింది. వివరాలు... గార్లదిన్నె మండలం బాటలో కొత్తపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి వారం రోజుల క్రితం అనారోగ్య కారణంగా ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చేరింది. గత శనివారం ఆమెకు ఆపరేషన్ చేశారు. శుక్రవారం డిశ్చార్జ్ చేయాలని డాక్టర్లు నిర్ణయించారు. ఈ క్రమంలో ఆఖరు పరీక్షగా ఎక్స్‌రేకు రెఫర్ చేయడంతో ఆమె సర్వజనాస్పత్రిలోని ఎక్స్‌రే కేంద్రం వద్దకు వెళ్లింది. ఆ సమయంలో ఓ వ్యక్తి ఆమెను బాగా పరిచయం ఉన్న వాడిలా పలకరించాడు. తన పేరు సుబ్బరాయుడని తెలిపాడు. తన కుమారుడు సాయికి మంచి పెళ్లి సంబంధం చూడాలని కోరుతూ మాటల్లో మభ్యపెట్టాడు. ఈ క్రమంలో ఎక్స్‌రే కేంద్రంలోకి వెళుతున్న ఆమెను ఆపి డబ్బు దగ్గర పెట్టుకోకూడదని, తన చేతికి ఇచ్చి ఎక్స్‌రే తీయించుకుని వచ్చిన తర్వాత ఇచ్చేస్తానని నమ్మబలికాడు. దీంతో తన వద్ద ఉన్న రూ.8 వేలను ఆగంతకుడి చేతిలో పెట్టి ఆమె ఎక్స్‌రే తీయించుకుని బయటకు వచ్చింది. అక్కడ సదరు వ్యక్తి లేకపోవడంతో తాను మోసపోయినట్లుగా గుర్తించి అనంతపురం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఖర్చులు మావి.. బిల్లులు వారికా?



సమావేశంలో పాల్గొన్న ఎంఈఓ-2లు

అనంతపురం ఎడ్యుకేషన్: స్టూడెంట్ కిట్ రవాణా, ఇతర పనులకు చెందిన మొత్తాన్ని మొదటి నుంచి ఈ విధులు పర్యవేక్షించిన ఎంఈఓ-2లకు వేయకపోవడం దారుణమని ఎంఈఓ-2 అసోసియేషన్ నాయకులు వాపోయారు. నగరంలో అసోసియేషన్ ప్రతినిధుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ఎంఈఓ-1, 2ల మధ్య విభేదాలు సృష్టించేలా అసిస్టెంట్ సీఎంఓ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఏడాదిగా రాష్ట్రవ్యాప్తంగా ఎంఈఓ-2లుగా నియమితులైన తాము అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ ప్రభుత్వ పథకాలు అమలులో కీలకంగా వ్యవహరిస్తున్నామన్నారు. ఈ క్రమంలో స్టూడెంట్ కిట్ రవాణా మొత్తం రెండు నెలల క్రితమే విడుదలైనా.. జిల్లాలో మాత్రం ఆలస్యంగా రిలీజ్ చేయడమే కాకుండా సొంత ఖర్చులతో రవాణా చేసిన ఎంఈఓ-2ల ఖాతాలకు కాకుండా ఎంఈఓ-1ల ఖాతాలకు జమ చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో ఎంఈఓ-2ల ఖాతాల్లోనే స్టూడెంట్ కిట్ల రవాణా మొత్తం జమ చేశారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంఈఓ-2 అసోసియేషన్ రాష్ట్ర సలహాదారు డాక్టర్ రామచంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురు ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు భవానీశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నారపరెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు లింగా నాయక్ , ఎంఈఓ-2లు మనోహర్, ఓబుళపతి, హరికృష్ణ, మున్వర్‌బాషా పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా ఆగకూడదు

- నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ ఆదేశం



అనంతపురం అర్బన్: జిల్లాలోని శ్రీరామరెడ్డి, సత్యసాయి బోర్డు, ఎన్ఎస్ఆర్‌డీ డబ్ల్యూపీ పథకాల పరిధిలో తాగునీటి సరఫరా ఆగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశించారు. నీటి ప్రాజెక్టుల పరిధిలో నెలకొన్న సమస్యలపై కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్‌బాషాతో కలసి ఆ శాఖ డీఈఈలు, ఏఈఈ, ఓ అండ్ ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) కాంట్రాక్టర్లతో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఆయా పథకాల్లో పనిచేస్తున్న కార్మికులు, సంఘాల నాయకులతో మాట్లాడి సమస్యలను తెలుసుకోవాలని ఎస్ఈకి సూచించారు. కార్మికులకు సంబంధించి వేతనం, ఇతర సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించాలన్నారు. కాంట్రాక్టర్లకు సంబంధించి పెండింగ్ బిల్లులు, ఇతర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ లలితాబాయి, ఇంజనీర్లు పాల్గొన్నారు.

భూవివాదంలో ఏఆర్ కానిస్టేబుల్ అత్యుత్సాహం

కళ్యాణదుర్గం రూరల్: భూ వివాదంలో ఓ ఏఆర్ కానిస్టేబుల్ అత్యుత్సాహంతో గిరిజన మహిళలను దుర్భాషలాడారు. తనదైన శైలిలో దూకుడు ప్రదర్శించారు. కళ్యాణదుర్గం మండలం చాపిరి తండాలో నాలుగు రోజుల క్రితం జరిగిన ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధిత మహిళలు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమిలో మూడ్ శ్రీన నాయక్, ఆయన భార్య మూడ్ నీలాబాయి, తదితరులు వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నారు. ఆ భూమిపై కన్నేసిన అదే గ్రామానికి చెందిన తిరుపాల్‌నాయక్ గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా 1బీ, అండగల్‌లో తన పేరు నమోదు చేయించాడు. నాలుగు రోజుల క్రితం కోర్టు ఆర్డర్‌తో పాటు పోలీసులను పిలుచుకొచ్చి భూమిలోకి ప్రవేశించాడు. ఆ సమయంలో ఆ భూమి పూర్వీకులకు చెందినదంటూ గిరిజనులు ఏకమొత్తంగా తిరుపాల్‌నాయక్‌పై తిరగబడ్డారు. అదే సమయంలో తిరుపాల్‌నాయక్ మామ, ఏఆర్ కానిస్టేబుల్ లక్ష్మీనాయక్ జోక్యం చేసుకుని గిరిజన మహిళలను దుర్భాషలాడుతూ రెచ్చిపోయారు. తాను అనుకుంటే తండాలో ఎవరూ ప్రాణాలతో మిగలరంటూ బెదిరింపులకు దిగారు. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

కాలువ నిర్మాణం వేగవంతం చేయండి



కాలువ పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: సుభాష్ రోడ్డులో చేపడుతున్న కాలువ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని సుభాష్ రోడ్డు వద్ద జరుగుతున్న కాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. జాతీయ రహదారుల విభాగం అధికారులు డ్రైనేజీ పనుల్లో కొంత భాగం పూర్తి చేసి ఇంకొంత భాగం వదిలేయడంతో గత కొన్ని రోజులుగా మురుగు రోడ్డుపై ప్రవహిస్తోందన్నారు. ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక కాలువ నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అనంతరం జాతీయ రహదారుల విభాగం ఇంజినీరింగ్ అధికారులతో మేయర్ మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్ కమల్ భూషణ్, ఈఈ సూర్యనారాయణ, నాయకులు ఖాజా, శీన పాల్గొన్నారు.

భక్తిమార్గమే అత్యంత ఉత్తమం



మొదటి రోడ్డు శివాలయంలో స్వామి గోవిందానంద సరస్వతి

అనంతపురం కల్చరల్: మనిషిని నైతిక విలువలతో నడిపించి మానసిక ప్రశాంతతను చేకూర్చే భక్తిమార్గంలో అందరూ పయనించాలని బాలకృష్ణానంద మహా సంస్థానం శుక శంకర పీఠం పీఠాధిపతి గోవిందానంద సరస్వతి ప్రబోధించారు. హైందవ ధర్మప్రచారంలో భాగంగా దక్షిణభారత దేశ యాత్రలు చేస్తూ చాతుర్మాస దీక్షల కోసం శ్రీశైలం వెళ్తున్న స్వామీజీ మార్గమధ్యమంలో గురువారం అనంతకు విచ్చేశారు. మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయానికి చేరుకున్న స్వామీజీకి ఆలయ అనువంశీకులు హోసూరు రామసుబ్రహ్మణ్యం నేతృత్వంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ స్వయంగా కాశీవిశ్వేశ్వరుడికి రుద్రాభిషేకం చేశారు. అనుగ్రహ భాషణంలో ధర్మప్రచార విశేషాలను, భక్తిమార్గ ఔన్నత్యాన్ని తెలియజేశారు. ఆలయం వారు భిక్షను ఏర్పాటు చేయడంతో పాటూ ఆధ్యాత్మిక యాత్రకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో వేదపండితులు సుంకేశుల సత్యనారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అడిగోపుల మరణం తీరని లోటు



అడిగోపుల వెంకటరత్నం

అనంతపురం కల్చరల్: ప్రసిద్ధ కవి అడిగోపుల వెంకటరత్నం మరణం సాహితీలోకానికి తీరని లోటని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాచపాలెం చంద్రశేఖర రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం తిరుపతిలో అడిగోపుల వెంకటరత్నం మరణించారు. అడిగోపుల మరణానికి సంతాపం తెలియజేస్తూ అరసం ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్య ఆరాధకుడిగా సూర్యోదయం, నిలువెత్తు సంతకం, రంగుల చీకటి, రెక్క విప్పిన రాగం, మట్టి మౌనం వహించదు, కొత్తగాలి వంటి అనేక కవితా సంపుటాలు అడిగోపులను తెలుగు సాహిత్యంలో మకుటం లేని మహరాజును చేశాయని గుర్తు చేసుకున్నారు. నాలుగు దశాబ్దాల కాలంలో 25 కావ్యాలను రచించిన అడిగోపుల సాహిత్యం చిరస్మరణీయమని సీనియర్ రచయితలు డాక్టర్ శాంతి నారాయణ, డాక్టర్ నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, వెంకటేశ్వర్లు కొనియాడారు.

నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి



ఓటుహక్కు వినియోగించుకుంటున్న శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రతి విద్యార్థి నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో 'విద్యార్థి దశలో ఎన్నికలు' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏజీఎం సుబ్బారెడ్డి ఎన్నికలను ప్రారంభించారు. ఈ ఎన్నికల్లో ఆయన ముందుగా తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థి దశలో నాయకత్వ లక్షణాలు కలిగిన వారిని తోటి విద్యార్థులు తమకు నాయకుడిగా ఎంచుకుంటారన్నారు. నాయకుడి ద్వారా పాఠశాలలో ఏ చిన్న సమస్యనైనా ప్రిన్సిపాల్ దగ్గర చర్చించడంతో పరిష్కరించుకోవచ్చన్నారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుమ్, ఏఓ గోపాల్, కో-ఆర్డినేటర్ ఇర్షాద్, డీన్లు సిరాజుద్దీన్, అప్పలనాయుడు, పీఈటీలు పాల్గొన్నారు.

అనంతేశ్వరీ పాహిమాం





సారె తీసుకొస్తున్న మహిళలు(ఇన్‌సెట్‌లో) ప్రకృతిమాత అలంకారంలో అనంతేశ్వరి

అనంతపురం కల్చరల్: నగరంలోని శివబాలయోగి ఆశ్రమంలో ఆషాఢమాస వేడుకలు కొనసాగుతున్నాయి. శుక్రవారం అనంతేశ్వరి అమ్మవారికి పెద్ద ఎత్తున సారె సమర్పణ కార్యక్రమం ఘనంగా జరిగింది. వందల సంఖ్యలో మహిళలు తరలి వచ్చి వివిధ రకాల పిండివంటలను నియమనిష్టలతో వండి ఊరేగింపుగా వచ్చి సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో సామూహిక లలితా సహస్రనామ పారాయణం, అష్టోత్తర కుంకుమార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం, రాత్రి వేర్వేరుగా సాగిన కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తుల అనంతేశ్వరి పాహిమాం నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం జరిగాయి. ప్రధాన అర్చకులు ఆషాఢమాసం విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు రత్నగిరి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో నిముషాంబ దేవి



పూజలందుకున్న నిముషాంబా దేవి



గోరింటాకు అలంకారంలో వాసవీ మాత



అలంకార సేవల్లో పెద్దమ్మ తల్లి

అనంతపురం కల్చరల్: ఆషాఢమాసంలో వచ్చిన రెండవ శుక్రవారం నగరంలోని పలు ఆలయాలలో అమ్మవారు వివిధ రూపాలలో దర్శనమిచ్చారు. పాతూరు చెరువుకట్టపై వెలసిన నిముషాంబ దేవి ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని పలు కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే స్థానిక కొత్తూరు అమ్మవారి శాలలో వాసవీమాతను గోరింటాకుతో అలంకరించి పూజలు నిర్వహించారు. రామనగర్‌లోని పెద్దమ్మ తల్లి, హెచ్చెల్సీ కాలనీ చాముండేశ్వరి, గుత్తిరోడ్డు చౌడేశ్వరి మాత, తపోవనంలోని గాయత్రీ మాత విశేష పూజలందుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జలధి



రాప్తాడు మండలం భోగినేపల్లిలో అగ్నిగుండ ప్రవేశం



ఆత్మకూరు: పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని ముట్టాల గ్రామంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో జలధి కార్యక్రమం జరిగింది. తెల్లవారుజామున పీర్ల స్వాములకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు చెట్లను కొట్టి గుండంలోకి వేశారు. పీర్ల స్వాములకు భక్తులు చక్కెర చదివింపులు చేయించారు.

రాప్తాడు: మండల పరిధిలోని భోగినేపల్లి గ్రామంలో శుక్రవారం మొహర్రం వేడుకలు ముగిశాయి. గ్రామంలో రైతులు చెట్లను తీసుకువచ్చి పీర్ల చావిడి ముందు ఏర్పాటు చేసిన అగ్ని గుండంలోకి వేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలోని యువకులు అగ్నిగుండం ముందు తప్పెట్లు కొట్టుకుంటూ ఉత్సాహంగా అలావ్ తొక్కారు. శుక్రవారం తెల్లవారుజామున 7 గంటలకు పీర్లను గుండంలోకి దింపారు. మళ్లీ సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు పీర్ల దేవుళ్లను భక్తిశ్రద్ధలతో ఊరేగించి జలధికి తీసుకెళ్లారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రాప్తాడు సీఐ మునిస్వామి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

అనంతపురం కల్చరల్: నగర శివారులోని జేఎన్‌టీయూ సమీపంలో శుక్రవారం రాత్రి పీర్లను ఊరేగించారు. హజరత్ అంగర్‌వలీ, ఇమామ్ ఖాసీం సాహెబ్ పీర్లను ప్రత్యేకంగా అలకరించి గ్రామోత్సవం చేశారు. యువకులు పీర్లను భక్తిశ్రద్ధలతో కొలుస్తూ భక్తిగీతాలతో వాటిని పీర్ల చావిడికి తెచ్చారు. భక్తులు చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఐకమత్యానికి ప్రతీక మొహర్రం

అనంతపురం సిటీ: ఐకమత్యానికి ప్రతీకంగా నిలిచే వేడుకల్లో మొహర్రం ప్రధానమైందని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. శుక్రవారం రాత్రి అనంతపురం శ్రీనివాసనగర్‌లోని జెండా కట్ట కమిటీ ఆధ్వర్యంలో చిన్న పీర్ల మకాన్‌లో పెట్టి మెరవణి కార్యక్రమం నిర్వహించారు. పర్లీను దర్శించుకున్న అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా మొహర్రం జరుపుకోండం గర్వంగా ఉందన్నారు. ఇటువంటి వేడుకలు ఐక్యతను చాటి చెబుతాయన్నారు. హజరత్ సర్మస్ వలి స్వామి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ప్రశాంత జీవనం గడపాలని ఆకాంక్షించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మను పూలమాలలు, శాలువలతో కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.



పీర్లకు మొక్కులు చెల్లించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

ఐసీడీఎస్‌లో ఫిర్యాదుల బాక్స్

అనంతపురం సెంట్రల్: ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే మహిళా ఉద్యోగులను లైంగిక వేధింపుల నుంచి కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేశారు. శుక్రవారం ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి ఫిర్యాదుల బాక్స్‌ను ప్రారంభించారు. బాధిత మహిళా ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది ఎవరైనా ఇబ్బందులు పడి ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలో శనివారం పలు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ జీవీ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈ సెక్షన్ పరిధిలోని అశోక్ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, సాయినగర్, హరిహర నగర్, జీసస్ నగర్, డ్రైవర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు గమనించాలని కోరారు.

'పెట్టుబడి సాయం' అందించాలి

రాప్తాడు: 2023 ఖరీఫ్, రబీ సీజన్‌లో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడడం, సకాలంలో వర్షాలు రాకపోవడంతో రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా నష్టపోయారు. పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు పెట్టుబడి సాయం అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందించాలని కోరుతూ శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణా రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2023 ఖరీఫ్‌లో 28 మండలాలను రబీలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం జరిగిందన్నారు. కరువు నివారణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించినా పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, పంట రుణాలు ఇవ్వాలని కోరారు. ఉపాధిహామీ కూలీలకు 200 రోజులు పని కల్పించాలన్నారు. రోజుకు రూ.200 కూలీ ఇచ్చి, పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, రైతులు నాగేంద్ర, రాంభూపాల్ రెడ్డి, ముత్యాలు, రవి, గోపాల్ రెడ్డి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై 1912 టోల్ ఫ్రీ నంబర్

అనంతపురం టౌన్: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912ను సద్వినియోగం చేసుకోవాలని విజిలెన్స్ సీఐ విజయ్‌భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలంలో విద్యుత్ అధికారుల సలహాలు, సూచనలను పాటించి ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్న, స్తంభాలు దెబ్బతిన్నట్లు తెలిసినా వెంటనే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే సకాలంలో సమస్యకు పరిష్కారం చూపిస్తారని తెలిపారు. అధికారుల సహకారం లేకుండా సొంతంగా ఎలాంటి విద్యుత్ తీగలు సరిచేసే పని చేయరాదని సూచించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: నగర పాలక సంస్థలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పాలకవర్గం, అధికారులు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 24, 25 తేదీల్లో మదనపల్లిలోని హార్సిలీ హిల్స్‌లో ఏపీ మునిసిపల్ కార్మిక సంఘం రాష్ట్ర వైజ్ఞానిక శిక్షణ తరగతులు నిర్వహించనున్నామన్నారు. శుక్రవారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో చిరంజీవి అధ్యక్షతన జరిగిన సంఘం జిల్లా సమితి సమావేశంలో శిక్షణ తరగతుల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక మునిసిపాలిటీల్లో ఈపీఎఫ్, ఈఎస్ఐ సమస్యలను అధికారులు విస్మరిస్తున్న కారణంగా కార్మికులు నష్టపోతున్నారన్నారు. పారిశుధ్య కార్మికులతో సమానంగా ఇంజినీరింగ్ కార్మికులకు వేతనం ఇవ్వాలన్నారు. శాశ్వత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, కార్మిక సంఘం నాయకులు వేణు, కొండయ్య, నాగేంద్ర బాబు, నాగరాజు, కుళ్లాయి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ, మునిసిపల్ కార్మిక సంఘం నాయకులు

బైక్‌పై దూకుడు



చేతికి బైక్ చిక్కితే చాలు... భయంకరమైన స్టంట్‌లు, వీలింగ్‌తో యువత రెచ్చిపోతోంది. 44వ జాతీయ రహదారిపైనే కాక నగర ప్రధాన మార్గాల్లోనూ బైక్ స్టంట్లతో కొందరు యువకులు చెలరేగిపోతున్నారు. ప్రతి రోజూ కలెక్టరేట్ ఎదుటనే రయ్యిమంటూ దూసుకెళుతున్నా... పోలీసులు చోద్యం చూడటం తప్ప ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు. దీంతో యువకులు తరచూ రేసింగ్‌లతో మరింత రెచ్చిపోయారు. ఈ క్రమంలో రాప్తాడు నుంచి సోములదొడ్డి వరకూ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాలతో స్టంట్ చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. బైక్‌రాయుళ్ల దూకుడుకు కళ్లెం పడేదెన్నడు? అని అనంత వాసులు ప్రశ్నిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



శానిటేషన్ సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు కమిషనర్ శ్రీహరిబాబు

అనంతపురం కార్పొరేషన్: పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాల మేరకు శుక్రవారం నగరంలోని వివిధ సర్కిళ్లలో జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. రోడ్డుపై చెత్త కనిపించ కూడదన్నారు. చెత్తను ఎప్పటికప్పుడు కంపోస్టుకు తరలించాలని ఆదేశించారు. ఎక్కడైనా వాహనాల సమస్య వస్తే తక్షణం సంబంధిత ఎంహెచ్ఓ, తదితరులకు సమాచారం ఇవ్వాలన్నారు. పారిశుధ్య కార్యదర్శులు విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు.

సర్వజనాస్పత్రిలో రోగుల కలవరం

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఫార్మసీ సిబ్బంది
- శిక్షణ విద్యార్థులతో మాత్రలు పంపిణీ చేయిస్తున్న వైనం



ఫార్మసీలో మందులు పంపిణీ చేస్తున్న ట్రైనీ విద్యార్థులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఫార్మసీ సిబ్బంది నిర్లక్ష్యం రోగులను కలవరపెడుతోంది. వాస్తవంగా రెగ్యులర్ ఫార్మసీ సిబ్బంది విధుల్లో ఉండటం లేదు. కొద్దిసేపు విధులు నిర్వర్తించిన అనంతరం కనబడకుండా వెళ్తున్నారు. దీంతో శిక్షణలో ఉన్న విద్యార్థులే మాత్రలు పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వివిధ విభాగాల నుంచి వందల సంఖ్యలో రోగులు మందులు తీసుకెళ్లేందుకు వస్తుంటారు. ఇటువంటి తరుణంలో మందులు పంపిణీ చేసే సమయంలో సంబంధిత సీనియర్ సిబ్బంది అందుబాటులో ఉంటూ శిక్షణ విద్యార్థులతో మాత్రలు పంపిణీ చేయించాల్సి ఉంది. కానీ అటువంటి పరిస్థితి ఇక్కడ కనిపించడం లేదు. పొరపాటున ఒక మందు బదులు, వాడే విధానంలో ఏమైనా తేడాలు వస్తే రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులు ఫార్మసీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తే బాగుంటుందని ఆస్పత్రి వర్గాలు కోరుతున్నాయి.

'మద్యం సేవించి స్కూల్ బస్సు నడిపాడు'



విద్యాశాఖ ఏడీ నాగరాజుకు వినతపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: రాప్తాడు మండలం ఎర్రగుంట వద్ద ఇటీవల జరిగిన స్కూల్ బస్సు ప్రమాదానికి ప్రధాన కారణం బస్సు డ్రైవర్ మద్యం మత్తులో ఉండడమేనని ఏఐఎస్ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం విద్యాశాఖ ఏడీ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలకు సంబంధించిన బస్సు డ్రైవర్ మద్యం సేవించి బస్సు నడుపుతూ చెట్టును ఢీకొట్టాడన్నారు. ఆ సమయంలో బస్సులో 57 మంది విద్యార్థులు ఉన్నారని.. అదృష్టవశాత్తూ ఎవరికీ పెద్ద ప్రమాదం జరగలేదన్నారు. డ్రైవర్ మద్యం సేవించి బస్సు నడుపుతున్నా యాజమాన్యానికి కనిపించ లేదా? అని ప్రశ్నించారు. విద్యార్థుల ప్రాణాలు అంటే లెక్కలేదా? అని మండిపడ్డారు. సామర్థ్యానికి మించి పిల్లలను బస్సులో తరలిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు నడుపుతున్న బస్సుల్లో చాలా వరకు కండీషన్‌లో లేవన్నారు. ఏడీని కలిసిన వారిలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు మంజునాథ్, ఉమా మహేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు సాయి స్వరూప, నాయకులు రాధా, జ్యోతి, పవన్, తారక్ ఉన్నారు.

సార్ ఎప్పుడొస్తారో?

- పనులపై తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- ప్రజా ప్రతినిధులు ఫోన్ చేసినా స్పందించని ఓ ఉన్నతాధికారి
- పని జరగాలంటే రోజుల తరబడి తిరగాల్సిందే ..

ఆత్మకూరుకు చెందిన ఓ వ్యక్తి తన కూతురి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం గత వారం రోజులుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. అక్కడున్న సిబ్బందిని అడిగితే వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దార్ సంతకాలు చేసి ఇవ్వాలని తెలిపారు. దీంతో ఆ తండ్రి సంతకాల కోసం రోజూ కార్యాలయం వద్దకు వస్తున్నాడు. అయితే అధికారులు మాత్రం కార్యాలయాలకు ఎప్పుడు వచ్చి వెళ్తున్నారో తెలియడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో పాఠశాలలో ఇవ్వాల్సిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు.

ఆత్మకూరుకు చెందిన ఓ రైతు తన పేరిట పొలాన్ని ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లాడు. వీఆర్వో, ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్ సమస్యను తెలుసుకుని భూమి వివరాలు ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు సంతకాలు కూడా చేశారు. అయితే ఓ ఉన్నతాధికారి ఆ రైతును నువ్వు ఫైల్ తీసుకుని అనంతపురంలో కలిస్తే పని చేస్తా అని చెప్పినట్లు సమాచారం. దీంతో ఆ రైతు కింది స్థాయి అధికారుల దగ్గర నుంచి ఫైల్ తీసుకుని సదరు అధికారిని కలిశాడు. అయితే ఇంత వరకూ జరిగిందో లేదో తెలియడం లేదు.

ఆత్మకూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓ ఉన్నతాధికారి విధులకు ఎప్పుడు హాజరవుతారో తెలియడం లేదు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తున్న ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సదరు అధికారి కోసం రోజుల తరబడి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని మండిపడుతున్నారు. అంతేకాకుండా భూములకు సంబంధించి మ్యుటేషన్ ఫైళ్లు ముందుకు కూడా కదలడం లేదని చెబుతున్నారు. భూ సమస్యలు పరిష్కారం అయితే సమస్య తీరుతుందనుకున్న రైతుల కల అందని ద్రాక్షలా మారింది. ఓ ఉన్నతాధికారి, కొంత మంది అధికారులు ఎప్పుడు వస్తారో ? తెలియకుండా ప్రజలు కార్యాలయం ఎదుట వేచి చూస్తున్నారు. ఈ విషయంపై అధికారులను అడిగితే అక్కడున్న సిబ్బంది మాత్రం సార్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు.. సార్ మీటింగ్‌కు వెళ్లారు.. ఫీల్డ్‌లో ఉన్నారంటూ సాకులు చెబుతున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కారించమని జిల్లా కలెక్టర్ చెబుతున్నా.. ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో మాత్రం అధికారులు ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నారు. ఏదైనా సమస్య తలెత్తినా లేదా సమాచారం కోసం అధికారుల వద్దకు వెళ్లినప్పుడు వారు లేకపోవడంతో ప్రజాప్రతినిధులు ఫోన్ చేస్తారు. అయితే అధికారులు మాత్రం ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదు. సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌ను సంప్రదించగా.. ఉన్నతాధికారి ఫోన్ నాలుగు రోజుల క్రితం పోగొట్టుకుపోయిందని తెలిపారు. అందుకే ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోందన్నారు. అంతేకాకుండా కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను అధికారులతో కలిసి పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.



ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం